"హలో!"

ఇద్దరూ స్పృహలోకొచ్చి పక్కకు చూశారు.

సురేష్ ఆమెను చూసి వులిక్కిపడ్డాడు. అందంగా, స్మార్ట్‌గా వుందా అమ్మాయ్! ఆంగ్లో ఇండియన్. ఆరోజు బుద్ధుడి బొమ్మకోసం వెళ్ళిన గిఫ్టు షాప్ గాళ్!

"హలో" అన్నాడు వులికిపాటుని అర్జంటుగా కప్పిపుచ్చుకుంటూ.

"నేను గుర్తున్నానా?" చిరునవ్వుతో అడిగిందామె.

"ఓ! లేకేం, మీ అంత అందమైన అమ్మాయిని ఎవరయినా మర్చిపోతారా?" తనూ నవ్వుతూ అన్నాడు.

"ఆ రోజు నుంచీ ఎదురుచూస్తున్నాను. మళ్ళీ మీరు ఈ రోడ్‌మీదే కనబడతారేమోనని".

"మీరే కాదు! చాలామంది అమ్మాయిలు ఇదే మాట చెప్పారు నాతో. ఏదో స్పెషల్ ఎట్రాక్షన్ పవర్ వుండి వుంటుంది."

"మీ ఎట్రాక్షన్ పవర్ కాదు! దానిని ఆ ఆడపిల్లల తాలూకూ ఇడియో సింక్రసీ అంటారు."

సురేష్‌కి మతిపోయింది. మహా మొండిఘటం యిది.

"అంటే?"

"ఇడియో సింక్రసీ అంటే తెలీదా?"

"తెలిసినట్టు లేదు".

తులసి నవ్వుతోంది.

"క్షణ కాలం వూగించే తెలివితక్కువతనం"

"వండర్‌ఫుల్! ఈ సారి డిక్షనరీ చూడాల్సి వచ్చినప్పుడు మీ దగ్గరకొస్తాను."

"షాపులోకొస్తారా?" అడిగిందామె.

"ఆ బొమ్మ తప్పకుండా తీసుకుంటాను. ఇప్పుడు మాత్రం కాదు"

"దానికోసం కాదు."

"మరి?"

"ఆ రోజు మీరు దొంగతనంగా తీసుకుపోయిన బుద్ధుడి బొమ్మ గురించి డిస్కస్ చేయటానికి"

సురేష్ నవ్వేశాడు.

"అదా! ఎలా కనుక్కున్నారు?"

"మా బాస్ మర్నాడు నా జీతంలో ఆ బొమ్మ ధర కట్ చేస్తానని చెప్పినప్పుడు."

"నిజంగా మీ బాస్ జీనియస్"

"మరి షాపులోకొస్తారా?"

"అవసరం లేదు. రేపు తెచ్చిచ్చేస్తాను. కానీ మీ బాస్‌కు చెప్పండి - అలా కస్టమర్స్‌ని మోసం చేయవద్దని."

"మోసమేమిటి?"

"ఆ బొమ్మ తాలూకూ చెవి - ముక్కు విరిగిపోయాయి. ఐ డోన్ట్‌లైక్ సచ్ చీటింగ్."

"ఆ బొమ్మ తెచ్చేవరకూ ఫిఫ్టీన్ రూపీస్ డిపాజిట్ పెట్టండి"

"నా మీద యింకా నమ్మకం కుదర్లేదా?"

"లేదు"

తులసి నవ్వాపుకుంటోంది.

"పోనీ ఓ పదిహేను రూపాయలు మీరే అప్పిస్తే? నాకు వుద్యోగం దొరగ్గానే తీర్చేస్తాను."

"షాప్‌లోనికి వస్తారా - బాస్‌ని పిలవమంటారా?"

తులసి తన బ్యాగ్‌లోంచి పదిహేను రూపాయలు తీసి ఆమెకిచ్చేసింది.

"థాంక్ యూ!" అందామె తులసితో "మీ దగ్గర యింకేమీ మిగిలివుండదు - అన్నీ దొంగిలించి వుంటాడీ పాటికి" నవ్వుతోంది.

ఆమె షాపులోకెళ్ళిపోయింది.

తులసి మళ్ళీ ప్రముఖ తెలుగు వార పత్రికల్లోని డాక్టర్ సమాధానాలు శీర్షిక గురించి చెప్పటం ప్రారంభించింది.

*                    *                    *

ప్రత్యూష ఏదో పుస్తకం చదువుతోంది. లైబ్రరీ ఇంచుమించుగా ఖాళీగా వుంది. ఏ క్షణంలోనయినా వర్షం కురవచ్చు. సురేష్ లోపలకు రావటం ఆమె గమనించలేదు.

"హలో!" పలకరించాడు సురేష్.

ఆమె పుస్తకంలోంచి తలెత్తి అతనివైపు చూసింది. పొడిగా నవ్వింది.

"అంత డీప్‌గా వెళ్ళిపోయారు - ఏం పుస్తకం?"

"సెక్స్ ఎ టు జడ్."

"అదంతా మన వార పత్రికల్లో వేస్తున్నారుగా. మళ్ళీ యిదెందుకు?"

"అందులో బూతు వుంటుంది. నాలెడ్జి వుండదు. అదీగాక టైంపాస్."

"టైం పాస్‌కి థియరీ కాదు చదవాల్సింది."

ఆమె నవ్విందీసారి మనస్ఫూర్తిగా.

"అలా వున్నారేమిటివాళ?"

"చాలా తేడా వుంది మీ ప్రవర్తనలో."

"ఏం తేడా వుంది."

"పెళ్ళి ముందు రోజు వుత్సాహానికి, తరువాత రోజు నిరుత్సాహానికి వున్నంత తేడా. ఏమైపోయారిన్ని రోజులూ?"

"డిసప్పాయింట్‌మెంట్" తల వంచుకుని టేబుల్ మీద చేతి వేలితో ఏదో డిజైన్ చేస్తూ చెప్పింది.

"ఎందుకు?"

"ఐ ఏ ఎస్ మళ్ళీ పోయింది"

"అయితే పదండి సెలబ్రేట్ చేసుకుందాం."

"సారీ! ఐయామ్ నాట్ ఇన్ మూడ్స్....."

"డోంట్ వర్రీ....ఐ ఎల్ ఎస్ ట్రై చేయండీసారి తప్పక సక్సెస్ అవుతారు.....మీ ఎడమచేతిలో ఆ సర్కిల్ వుంది చూశారా..."

"ఐ ఎల్ ఎస్ ఏమిటి?"

"ఐ ఏ ఎస్ ఫెయిలయితే బాధపడేవాళ్ళ కోసం కొత్తగా ప్రారంభించారు. ఇండియన్ లవ్ సర్వీస్....ఇంక వెళదామా మరి?"

"కాఫీ ఇక్కడికే తెప్పిస్తానులెండి" నవ్వాపుకుంటూ ప్యూన్‌ని నిలిచి కాఫీకి పంపించింది.

"మీరేమైపోయారు యిన్ని రోజులూ?"

"వేట ఎక్కువ చేశాను."

"ఏమీ దొరకలేదా?"

"ఊహూ! అదీగాక యిప్పుడున్న జాబ్ మరీ టైర్ సమ్‌గా వుంటోంది."

"ఇప్పుడున్న జాబేమిటి?" అనడిగి అంతలోనే సిగ్గుపడిపోయింది. "తెలుసులెండి చెప్పొద్దు"

"ఇంకో సమస్య కూడా చుట్టుకునేట్లు వుంది యిప్పుడు" అన్నాడు సురేష్.

"ఏమిటది?"

"తులసి జాబ్ పోయేట్లుంది"

"అరె ఎందుకని?"

"మేమిద్దరం పెళ్ళి చేసుకుని కాపురం పెట్టినట్లు పెళ్ళంటే ఇష్టంలేని అమ్మాయి ఎవరో మేనేజిమెంట్‌కి చెప్పింది."

"అదేమిటి పెళ్ళి చేసుకుంటేనేం?"

"ఆ కంపెనీ రూల్స్ అలా వున్నాయి. మొన్న మొన్నటి వరకూ ఎయిరిండియాలోనూ, విజయవాడలో ఓ కంపెనీలోనూ అలాంటి రూల్స్ వున్నాయి కదా!"

"ఎందుకలాంటి రూల్స్ పెట్టటం? అవి మన రాజ్యాంగానికి వ్యతిరేకం కదా."

"మన రాజ్యాంగం ఏమిటో మన గవర్నమెంట్స్‌కే సరిగ్గా తెలీదు. అదీగాక రాజ్యాంగాన్ని అసలెవరు ఫాలో అవుతున్నారని."

కాఫీ తీసుకొచ్చి యిచ్చాడు ఫ్యాన్.

"అయితే ప్రాబ్లమే మీకు"

"అవును! ఇప్పుడు కేవలం రాత్రుళ్ళే - అప్పుడు రాత్రింబగళ్ళు."

అతని చేతిమీద లాగి కొట్టిందామె.

"అరె! మర్చిపోయాను. చాలా రోజులయింది మీ కోసం పేపర్ కటింగ్స్ దాచాను పనికొస్తాయేమో చూడండి" తన బ్యాగ్‌లో అన్ని అరలూ వెతికి కొన్ని న్యూస్‌పేపర్స్ కటింగ్స్ బయటకు తీసిందామె.

అన్నీ ఓ నిమిషంలో చూసేశాడతను.

"ఈ బంగారు భవిష్యత్తు ఉద్యోగాలన్నీ నాకు తెలుసు. ఇంటింటికి వెళ్ళి అగరొత్తులు, సబ్బులు అమ్మమంటారు"

"అవును నాకూ ఎక్స్‌పీరియన్స్ వుంది."

"తమాషాగా వుందే. మనిద్దరిదీ ఒకే రాశి అనుకుంటాను.  మీ డేటాఫ్ బర్త్ ఏమిటి?"

"లైబ్రరీ క్లోజ్ చేసే టైమయింది" అందామె లేచి నిలబడుతూ,

"మీరు చాలా హెల్ప్ చేస్తున్నారు. చూస్తూండండి. ఏదొక రోజు మీరు వప్పుకుంటే చెమటోడ్చి మీ ఋణం తీర్చేసుకుంటాను."

ప్రత్యూష నవ్వుతోంది.

*　　　*　　　*

గంగాభవాని వారపత్రిక చదువుతోందల్లా సురేష్ లోపలకు రావడం చూడగానే లేచి నిలబడి పైట సరిజేసుకుంది.

"ఏం కావాలి?" అంది తీక్షణంగా.

"నిజంగా చెప్పండి. మీకు తెలీదా?" నవ్వుతూ అడిగాడు.

"వెళ్ళండి మీరు చేసిన పనికి తలెత్తుకోలేకపోతున్నాను"

"అంటే తల వంచుకునే వాళ్ళందరూ మన లాగానే...." సమీపంగా వచ్చేశాడతను.

ఆమె ఓ అడుగు వెనక్కి వేసింది.

"ఇంక దగ్గరకొచ్చారంటే మర్యాదగా వుండదు" రోషంగా అంది.

"మొన్న మర్యాదగానే వుంది కదా?"

"చెంప పగిలేదే, కమల ఆ సమయానికి రాకపోయినట్లయితే"

"అయితే ఆమెను పిలుచుకొస్తాను మళ్ళీ."

"చాల్లే ఇక వెళ్ళండి."

"మీకు చెప్పిన జ్యోతిష్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు మీరు"

"ఏమిటది?"

"అదే! మీరు స్వర్గ సుఖాల్లో తేలిపోయే రోజు అతి త్వరలో వచ్చేస్తుందనీ, మీ జీవితాన్ని అద్భుతమయిన మలుపు తిప్పే వ్య క్తికి ఎలాంటి అభ్యంతరమూ చెప్పొద్దనీ"

"దానికీ, దీనికీ ఏమిటి సంబంధం" అడిగిందామె.

అతను గొంతు తగ్గించి రహస్యంగా మాట్లాడాడు "ఇదే ఆ సమయం. అంచేత అడ్డు చెప్పకండి. అద్భుతమైన మలుపు తిప్పుతాను. స్టీరింగ్ కంట్రోల్ బాగా చేయగలను" ఆమెను కౌగిట్లోకి తీసుకోబోయాడు.

అతని ఊపిరి వేడిగా తగులుతోంది. గంగాభవానీ శరీరమంతా ఆవిర్లు కమ్ముతోంది. అంతలోనే తెలివి తెచ్చుకుని ఒక్కతోపు తోసింది.

"వెళ్తారా లేదా?" కోపం నటిస్తూ అడిగింది.

"ఒక షరతుమీద....."

"ఏమిటది?"

"అర్జంటుగా యాభయ్ రూపాయలు అప్పు కావాలి"

"ఆడాళ్ళను అప్పు అడగటానికి సిగ్గుండాలి."

"రెండో దానికి మీరు ఒప్పుకోవటం లేదు కదా...."

ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు.

"మళ్ళీ ఎప్పుడిస్తారు?"

"ఉద్యోగం రాగానే...."

"మీ కెప్పటికీ ఉద్యోగం రాకపోతే?"

"శరీర శ్రమ చేసి మీ ఋణం తీర్చేసుకుంటాను..."

ఆమె కళ్ళు డేగ కళ్ళయిపోయినయ్.

"అదేం కుదరదు. వచ్చే ఫస్టుకల్లా నా డబ్బు నాకివ్వాలి. అలాగైతేనే యిస్తాను"

"ఇస్తాను కానీ ఓ రిక్వెస్ట్...."

"ఏమిటి?"

"తులసికీ విషయం చెప్పకండి..."

"మీరివ్వకపోతే చెప్తాను"

ఆమె లోపలికి  వెళ్ళి తీసుకొచ్చి అతని కందించింది.

సరిగ్గా అదే సమయంలో కమల లోపలకు రాబోయి వారిద్దరినీ చూచి చటుక్కున వెనక్కు తిరిగింది.

"ఫర్లేదు రండి. ఈ సారి మీవంతు"అన్నాడతను.

కమల అడుగులు తడిబడినయ్‌గానీ ఆగలేదు. గంగాభవానికి నవ్వూ, కోపం రెండూ వచ్చినయ్.

"మీ మాటల వల్ల పచ్చని  సంసారాలు కూడా కూలిపోతాయ్" అంది నిష్ఠూరంగా.

"అది భార్యాభర్తలు మొదట్లోనే పునాది సరిగ్గా వేయటం మీద ఆధారపడి వుంటుంది. నా మాటల మీద కాదు, మా మోహన్‌జీ ఎంత స్ట్రాంగ్ పునాది వేశాడో చెపితే మీరు ఆశ్చర్యపోతారు. వాళ్ళావిడ ఇప్పటికీ హాస్పిటల్లోనే వుంది."

"ఇంక మీరు వెళితే నేను నా వంట పని చూసుకుంటాను" అసహనంగా అందామె.

సురేష్ బయటికొచ్చాడు.

టైము పన్నెండు దాటింది. బస్‌స్టాప్‌కొచ్చి డబల్‌డెకర్ ఎక్కాడు.

*                    *                    *

తలుపు తెరిచి అతనిని చూచి శోభాదేవి ఆశ్చర్యపోయింది.

"మీరా! రండి."

లోపలకు నడిచి కూర్చున్నాడతను.

జేబులో నుంచి యాభయ్ నోట్ తీసి ఆమెకిచ్చాడు.

"మీరు అదృష్టవంతులు. అందుకే అప్పు పుట్టింది నాకు."

ఆమె వెళ్ళి కిటికీ తలుపులు, గది తలుపులు మూసివేసింది.

"లోపల గదిలోకి వెళదాం రండి"

సురేష్ ఆమె వెనుకే గదిలోకి నడిచాడు. ఒకే మంచం, ఒకే టేబులూ.

ఆమె అతనికి సమీపంగా వచ్చేసింది.

"ఇంకా ఆలోచిస్తారేం?"

సురేష్ ఆమెను వెనక్కు నెట్టి బయటి గదిలోకొచ్చేశాడు.

"అదేమిటి వెళ్ళిపోతారేం?"

"నేను వచ్చింది అందుక్కాదు. నీకు డబ్బు యివ్వటానికి."

ఆమె నిశ్చేష్టురాలయింది.

"డబ్బు ఊరికే యిస్తారా?"

"అందరూ అందరికీ ఇవ్వకపోవచ్చు. ఒక్కొక్కరు ఒక్కొక్కరికి యిస్తారు."

కొద్దిసేపు ఆమె అతని వంకే చూస్తుండిపోయింది నిశ్శబ్దంగా.

"నాకిదంతా జరిగిందని నమ్మబుద్ధి కావటంలేదు"

"ఏమిటి మీ పరిస్థితి? ఎందుకిలా అయింది?"

"ఆయన తాగుబోతు-నా కారెక్టర్ మీద అనుమానం"

సురేష్‌కి నవ్వు వచ్చింది.

"చెంప దెబ్బలు కొడ్తూ తిరిగే అమ్మాయి మీద అనుమానమా!"

"చివరకు నేనే ఆయనను వదిలేశాను."

"కానీ ఇలా ఎన్నాళ్ళు గడపటం?"

"మరో ఆరు నెలలు - టైలరింగ్ చేస్తున్నాను. అదయిపోగానే ఇంక నాకు సమస్య వుండదు."

సురేష్ బయటికొచ్చేశాడు.

ఆమె వెనుకే వచ్చింది.

"మళ్ళీ రారూ?"

"ఊహూ నేను వచ్చినా వుపయోగం ఏమీ లేదు."

తిన్నగా డార్క్ డెవిల్ రూమ్‌కి చేరుకున్నాడు.

"కమాన్-కమాన్ - నీ కోసమే చూస్తున్నాను"

"ఏమిటి సంగతి?"

"నటాషా అర్జంటుగా హోటలు రూమ్‌కి రమ్మంది"

"నటాషా ఎప్పుడొచ్చింది?"

"రాత్రే - అర్జంట్ పని వుందట నీతో"

"ఓ.కె!"

"ఓ.కే! అని నుంచోకు-వెంటనే వెళ్ళు. లేకపోతే మళ్ళీ నా రూమ్‌కొస్తుంది."

సురేష్ హోటల్ చేరుకున్నాడు.

696 రూం డోర్ బెల్ మోగించాడు.

నటాషా తలుపు కొంచెంగా తెరచి చూసింది.

"మైగాడ్ వచ్చావా! ప్రొద్దున్నుంచీ చూస్తున్నాను నీ కోసం"

"దానికేనా?" అనుమానంగా అడిగాడు.

అతని చెంపమీద నెమ్మదిగా కొట్టిందామె.

"ఛీ నీకెప్పుడూ.... ఓ సమస్య వచ్చింది"

"ఏమిటది?"

"అర్జంటుగా మనం ఓ డాక్టర్ దగ్గరకెళ్ళాలి. లేడీ డాక్టర్"

"అంటే?"

"ఎస్! తీయించాలి"

"కాని ఎలా జరిగిందది?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"అందరిలాగానే పొరపాటు. ఇప్పుడలాగే వదిలేస్తే ఆ పొరపాటునెవరు పెంచుకుంటారు? అంచేత"

సురేష్ సోఫాలో కూర్చున్నాడు.

అతనికి అతి సమీపంగా కూర్చుని అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుందామె.

"నీకు తెలిసిన లేడీ డాక్టర్స్ ఎవరయినా వున్నారా?"

"లేరు! కానీ తెలియాల్సిన అవసరమేముంది? బిజినెస్ ఈజ్ బిజినెస్"

"అయితే త్వరగా పద"

"ఓ.కె! పద"

ఇద్దరూ ఆటోలో బయల్దేరారు.

సురేష్ చకచకా ఆలోచించసాగాడు.

డాక్టర్ కుమారి తనకు తెలుసు. తెలుసంటే తెలీదు కానీ ఓసారి తులసితో వెళ్ళాడు. ఏదో ప్రాబ్లమ్ వచ్చినప్పుడు ఆమె కన్‌ఫర్మేషన్‌కి. టాబ్‌లెట్ ఇచ్చాక సమస్య సాల్వ్ అయిపోయింది.

అంతే అంతవరకే తెలుసు. బహుశా ఇప్పుడు మళ్ళీ వెళితే తనను గుర్తించలేదేమో!

ఆటో డాక్టర్ డిస్పెన్సరీ ముందాగింది. అరగంట తర్వాత తమ టర్న్ వచ్చింది.

ఇద్దరూ లోపలికి నడిచారు.

"గుడ్ మార్నింగ్ డాక్టర్"

"గుడ్ మార్నింగ్ - కూర్చోండి"